
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 2 మే 2024



ఘనంగా మే డే వేడుకలు 8లో..

మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలు 8లో..



పని ప్రదేశాల్లో ప్రచారం

- ఉపాధి, వ్యవసాయ పనుల్లో ఓటర్లు
- అక్కడికే వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థులు
- ఉదయమే గ్రామాల్లో దర్శనమిస్తున్న రాజకీయ నాయకులు
- తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని వేడుకోలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో ఎండలు దంచి కొడుతుండడంతో పార్లమెంట్ ఎన్నికల ప్రచార సరళి మారిపోయింది. వేసవి వచ్చిందంటే చాలు వ్యవసాయ కూలీలు, ఇతర కూలీలంతా ఉపాధిహామీ పనుల్లో నిమగ్నం అవుతుంటారు. రైతులు వ్యవసాయ పనుల్లో మునిగితేలుతున్నారు. మధ్యాహ్నం కాగానే ఎండల ధాటి నుంచి రక్షించుకునేందుకు ఇళ్లకు చేరుకుని సేద దీరుతున్నారు. ఈ సమయంలో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు తమ వెంట నాయకులు, కార్యకర్తలు ఎవరు రాకపోవడంతో గ్రామాలు, పట్టణాల్లో అభ్యర్థులు, వారి పార్టీ నాయకులు ఉదయం, సాయంత్రం వేళలో ప్రత్యక్షం అవుతున్నారు. ఉదయమైతే ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే ఇంకొందరు నాయకులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి కొనుగోళ్ల గురించి తెలుసుకుని పనిలో పనిగా తమకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్, కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీజేపీ నుంచి గోమాసే శ్రీనివాస్‌తో పాటు మరో 39 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు మాత్రమే ప్రజల్లోకి ప్రచారం నిర్వహిస్తున్నారు. వారం రోజుల నుంచి పెద్దపల్లి జిల్లాలో 42.0 డిగ్రీల నుంచి 45.9 డిగ్రీల వరకు ఎండలు దంచి కొడుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 10 కాగానే ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ఆలోపే పనులను పూర్తి చేసుకుంటున్నారు. పట్టణాలు, గ్రామాల్లో దుకాణాలు తెరిచే ఉంచుతున్నా ఎవరూ రావడం లేదు. 2019లో మొదటి విడతలోనే రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 11వ తేదీన జరిగింది. ప్రస్తుతం నాలుగో విడతలో మే 13న రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తున్నారు. దీంతో అభ్యర్థులకు ఎన్నికల ప్రచారం నిర్వహించడం చుక్కలు కనబడుతున్నాయి. ఎండలు మండుతుండడంతో ప్రచారానికి వచ్చేందుకు పార్టీల నాయకులు, కార్యకర్తలు భయపడుతున్నారు.

ఎండ దెబ్బకు విలవిల..

గ్రామాల్లో ఉపాధి కూలీలు, రైతులు ఉదయాన్నే పనులకు వెళ్లి 11 గంటలకు ఇళ్లకు చేరుకుంటున్నారు. అభ్యర్థులు కూడా ఉదయం 6 గంటల నుంచే ప్రచారం చేపడుతున్నారు. పనులు జరుగు తున్న చోటకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. పట్టణాల్లో సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు రోడ్‌షో నిర్వహిస్తూ కార్నర్ మీటింగులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం వేళలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఫంక్షన్ హాళ్లలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రచారానికి వెళితే ఎండదెబ్బ తాకడం ఖాయమని కార్యకర్తలు భయపడుతున్నారు. ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఆది కేశవరావు ఇటీవల తమ నాయకుడి వెంట గోదావరిఖనికి ప్రచారానికి వెళ్లి రాత్రి తిరిగి వస్తుండగా, అస్వస్థతకు గురై రెండు గంటల్లోనే గుండెపోటుకు గురై మరణించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతరకు మిట్ట మధ్యాహ్నం గ్రామాల నుంచి జనాలకు తరలించారు. సభ ముగిసిన తర్వాత ఒక మహిళ వడదెబ్బకు గురై మరణించారు. ఈక్రమంలో పార్టీ అధినేతలు, స్టార్ క్యాంపెయినర్లతో బహిరంగ సభలు, రోడ్‌షోలు నిర్వహించాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రచారానికి సరిగ్గా 10 రోజులు మిగిలి ఉన్నాయి. ఈ పది రోజుల్లో ఉష్ణోగ్రతలు 48.0 డిగ్రీలకు పెరగవచ్చని వాతావరణ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 46.0 ఉష్ణోగ్రత డిగ్రీలు దాటేసింది. పార్లమెంట్ పరిధి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు విస్తరించి ఉండడంతో అభ్యర్థులు అన్ని పట్టణాలు, పెద్దపెద్ద గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఎండల తీవ్రతను చూస్తుంటే గతంలోకంటే పోలింగ్ శాతం తగ్గుముఖం పట్టే అవకాశాలు కనబడుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఓటర్లు గ్రామాలకు వచ్చి ఓట్లు వేసే పరిస్థితి లేకుండా పోయింది. మొత్తంమీద మండుతున్న ఎండలతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు, వారి మద్దతుదారులు, నాయకులు తంటాలు పడాల్సి వస్తున్నది. కేంద్ర ఎన్నికల కమిషన్ కూడా వేసవిలో ఎన్నికలు నిర్వహించే విషయమై పునరాలోచన చేయాలని, ఏడాదిలో ఏప్రిల్, మే నెలల్లో ఎన్నికలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని ఓటర్లు, వివిధ పార్టీల నాయకులు కోరుతున్నారు.

ఓటర్ స్లిప్పులు అందించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

పెద్దపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతి ఓటరుకు ఓటర్ స్లిప్పులను అందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ స్థానానికి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన అదనపు బ్యాలెట్ యూనిట్లు ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఈవీఎం యంత్రాలపై బ్యాలెట్ పత్రాల కమీషనింగ్‌కు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి అవసరమైన మేర పోస్టల్ బ్యాలెట్ పేపర్లు అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా పంపిణీ చేయాలని సూచించారు. పారదర్శకంగా హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి పార్లమెంట్ పరిధిలో తుది ఓటర్ జాబితా రూపొందించామని, ప్రతి ఓటర్ కు ఓటర్ సమాచార స్లిప్పులు పంపిణీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్, అరుణశ్రీ, ఆర్డీఓలు హనుమా నాయక్, డీపీఓ ఆశాలత పాల్గొన్నారు.

ట్రినిటి ఇంజనీరింగ్‌లో క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్



క్యాంపస్ ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులతో దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, మే 1 : స్థానిక ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 17కు పైగా బహుళజాతి కంపెనీలతో పాల్గొనగా 224 మంది విద్యార్థులకు పైగా ఉద్యోగాలు పొందారు. ఉద్యోగం పొందిన విద్యార్థులకు ట్రినిటి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వారి చేతుల మీదుగా ఆయా కంపెనీల నియామకపత్రాలు ఉద్యోగం పొందిన విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మనిగణేష్, అకాడమిక్ డైరెక్టర్ అశోక్ కుమార్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆరిఫ్, హెచ్‌ఓడిలు నటరాజన్, స్వాతి, ప్రభాకర్, రామ్మోహన్, చొప్పరి వంశీ, రిక్రూట్మెంట్ రిప్రజెంటేటివ్ చందర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకం

- కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం - మేడే సభలో ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు



ప్రసంగిస్తున్న ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు



ఎర్ర జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, మే 1 : ఎన్టీపీసీ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని, కార్మికుల శ్రమ ఫలితంగానే ప్రపంచస్థాయి సంస్థగా ఎన్టీపీసీ ఎదిగిందని రామగుండం, తెలంగాణ ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాడు పేర్కొన్నారు. మేడే సందర్భంగా బుధవారం ప్రాజెక్టులోని మేడే పార్కులో ఈడీ ఎన్టీపీసీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఈడీ ప్రసంగించారు. ఎన్టీపీసీ కార్మికులు శ్రమ వులని, నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తికి అంకితభావంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్మికుల సంక్షేవనికి ఎన్టీపీసీ యాజమాన్యం అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. కార్మికులు విధి నిర్వహణలో రక్షణ సూత్రాలను పాటించాలని, తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఈడీ కేదార్ రంజన్ సూచించారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో పని చేసి సంస్థను ముందుకు తీసుకవెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జీఎం(ఒఅండ్ ఎం) ఎ.కె.త్రిపాఠి, ఎన్‌బీసీ సభ్యుడు, గుర్తింపు సంఘం నేత బాబర్ సలీం పాష, అధ్యక్ష, కార్యదర్శులు వేముల కృష్ణయ్య, ఆరెపల్లి రాజేశ్వర్, కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ప్రైవేటీకరణను తిప్పికొట్టాలి

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, మే 1: కార్మికులు ఐకమత్యంతో ప్రైవేటీకరణను తిప్పికొట్టాలని, చికాగో అమరవీరుల వీరమరణం మరువలేనిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మేడే సందర్భంగా బుధవారం లక్ష్మీనగర్‌లోని వీరాంజనేయ హమాలీ సంఘం కార్యాలయంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీతో కలిసి మేడే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్‌కుమార్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, బాలరాజ్‌కుమార్, నాయకులు తిప్పారపు శ్రీనివాస్, మాదరబోయిన రవికుమార్, పాతిపెల్లి ఎల్లయ్య, గట్ల రమేష్, మీసాల సతీష్, అశోక్ పాల్గొన్నారు. కళ్యాణ్‌నగర్‌లోని విఘ్నేశ్వర లోడింగ్ అన్‌లోడింగ్ రిక్షాట్రాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు మొహిద్‌సన్ని ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ హాజరై జెండావిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీటి బాలరాజు, ఉల్లంగుల రమేష్, చెరుకు బుచ్చిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య, మల్లయ్య, సాయిలు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

పెద్దపల్లి కల్చరల్ : జిల్లా కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు నిర్వహించారు. జెండా చౌరస్తా, ప్రభుత్వ ఆసుపత్రి, బస్టాండ్ వద్ద సీపీఐ జిల్లాకార్యదర్శి తాండ్ర సదానందం ఎర్ర జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఉదయ్, ఏఐటీయూసీ నాయకులు బుద్దుల రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మానస్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ పుసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

సుల్తానాబాద్, మే 1: ఓటు హక్కు వినియోగంపై మండలంలోని కాట్నపల్లిలో ఉపాధిహామీ కూలీలకు పెద్దపల్లి మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టు స్వప్న ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బుధవారం కాట్నపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళ హక్కులు, చట్టాలు, ఓటు హక్కు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళ సంరక్షణ, వారు అత్యవసర సమయాలలో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు, సఖీ కేంద్రం వారి సేవలు, లింగ వివక్షత, పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం, బాల్య వివాహ నిషేద చట్టం, పిల్లల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలకు లబ్ధి చేకూర్చే లేబర్ కార్డులు, సుకన్య సమృద్ధి యోజన వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమాద బీమా పథకాల గురించి వివరించారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యదర్శి శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి సన్మానం



వైద్యురాలిని సన్మానిస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, మే 1: మేడే సందర్భంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సిబ్బందిని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షురాలు సుమలత ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు లప్పారావు, రేణుక, తిరుమలేశ, ల్యాబ్‌ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ, నర్సింగ్‌స్టాఫ్ విజయ, వసంత, ఏఐటీయూసీ నాయకులు శేఖర్, కరీం పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చేసిన అభివృద్ధి శూన్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి

మంథని, మే 1: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మంథని నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక రాంరెడ్డి కాంప్లెక్స్‌లో జరిగిన బీజేపీ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో సునీల్‌రెడ్డి మాట్లాడుతూ 30ఏళ్లుగా మంథనిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కుటుంబం ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. దేశంలో అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలన్నారు. బీజేపీ నేతలు పోతరవేన క్రాంతికుమార్, నాంపెల్లి రమేష్, మల్కా మోహన్‌రావు, సత్యప్రకాష్, నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

సైబర్ నేరస్థుల ఉచ్చులో పడి మోసపోవద్దు : ఏసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటరమణ

కోల్‌సిటీ, మే 1: సైబర్ నేరస్థుల ఉచ్చులో పడి మోసపోవద్దని, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలని గోదావరిఖని సైబర్ సెక్యూరిటీ ఏసీపీ వెంకటరమణ పిలుపునిచ్చారు. సైబర్ జాగృకత దివాస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం గోదావరిఖనిలోని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్‌సైన్సెస్(సిమ్స్)లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటీపీ ఫ్రాడ్స్, బయోమెట్రిక్ కెడిక్ కార్డ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్, ఆన్‌లైన్ పేమెంట్స్, అడ్వటైజ్డ్‌మెంట్స్, పెటెక్స్ కొరియర్‌ల పేర ఫ్రాడ్‌లు, లోన్‌యాప్‌లు, నకిలీ వెబ్‌సైట్ల గురించి తెలిపారు. ఆన్‌లైన్ మోసాలను అడ్డుకట్ట వేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, కళాశాల ప్రొఫెసర్లు, సైబర్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ తల్లికి ఎమ్మెల్యే పూజలు

జూలపల్లి, మే 1 : మండలంలోని తెలుకుంటలో గౌడకుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మతల్లి పట్నాల వేడుకల్లో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని ప్రత్యేకపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, కొంపెల్లి స్వామి, గౌడసంఘం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నియామకం

కళ్యాణ్‌నగర్, మే 1: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రామగుండం అసెంబ్లీ బీఎల్‌పి కమిటీ చైర్మన్‌గా కొప్పుల శంకర్‌ను, సభ్యులుగా ఎండీ ఆసిఫ్‌పాషా, పెండ్యాల మహేష్, కారెంగుల సురేష్, గాదె సుధాకర్, ముచ్చకుర్తి రమేష్, తిప్పర్తి ప్రసాద్, నంది వెంకటేష్‌ను నియమిస్తూ బుధవారం పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మండుతున్న ఎండలు..

- రామగుండంలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మధ్యాహ్నం 12గంటలకే తగ్గిపోతున్న జన సంచారం
- ఇళ్ల పరిమితమవుతున్న ప్రజలు



ఖనిలో నిర్మానుష్యంగా మారిన కళ్యాణ్‌నగర్ వ్యాపార కూడలి దారి



సుల్తానాబాద్‌లో జన సంచారం లేని పోస్టాఫీసు రోడ్డు

కళ్యాణ్‌నగర్, మే 1: భానుడు భగభగమంటున్నాడు. నిన్నమొన్నటి వరకు ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నా గత పదిరోజులుగా ఎండలు మండుతున్నాయి. ఉదయం 6గంటలకే భగభగమంటున్నాడు. రామగుండంలో బుధవారం రాష్ట్రంలోనే అత్యధికంగా 46డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. మంగళవారం 44డిగ్రీలు నమోదు కాగా బుధవారం రెండు డిగ్రీలు పెరిగి 46డిగ్రీలు నమోదు అయ్యింది. ఉదయం 11గంటలకు లక్ష్మీనగర్‌లోని వాణిజ్య, వ్యాపార కేంద్రాలు బోసిపోయాయి. ఎండవేడిని తట్టుకోలేక ప్రజలు బయటకురావడం లేదు. ఉదయం 10గంటలకే రామగుండంలో 41డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు చేసుకోవడం గమనార్హం. జనం అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావడం లేదు. రాత్రి 10గంటలు దాటినా ఎండవేడి తగ్గడం లేదు. రెండు రోజులుగా భానుడు ప్రతాపం చూపుతుండడంతో జనం విలవిలాడుతున్నారు. ఎండ వేడికి ఏసీలు, కూలర్ల ప్రభావం కూడా సరిపోవడం లేదు. ఓసీపీల్లో 49డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రెండవ షిఫ్టు విధులకు వెళ్లాలంటే కార్మికులు భయపడుతున్నారు. షిఫ్టు సమయాలు మార్చాలని యూనియన్లు డిమాండ్ చేస్తున్నా యాజమాన్యం స్పందించడం లేదు. మరో నెల రోజులు ఎండల ప్రభావం ఎలా ఉంటాయోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

సుల్తానాబాద్ : ఎండలు మండిపోతుండడంతో జన జీవనం కష్టంగా మారింది. భరించలేని విధంగా ఎండలు ఉండడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం పది పదకొండు గంటల సమయం దాటితే చాలు భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. దాంతో ప్రజలు మధ్యాహ్నంలోగా ఇంటికి చేరుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చిరువ్యాపారులు, ఇతర రోజువారి కూలీలు మాత్రం కుటుంబ పోషణ నిమిత్తం ఎండలో గడపక తప్పడంలేదు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులపై కూడా ఎండల ప్రభావం చూపుతోంది. చెరువులు, కుంటలలో ఉపాధి పనులు ఈ వేసవిలో జోరుగా సాగుతుండేవి. కానీ కొదిరోజులుగా ఎండల తీవ్రత ఎక్కువ ఉండడంతో కూలీలు కూడా పనులు చేయడానికి భయపడుతున్నారు. ఇప్పటికే తప్పనిసరి పరిస్థితులలో ఎండలో గడిపిన వారు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. కాగా ఎండల భయానికి జనాలు బయటకు వెళ్లడానికి జంకుతున్నారు.అత్యవసర సమయాలలో కూరగాయలకు, ఇతర నిత్యావసర సరుకులకు ఉదయంపూట గానీ లేదా సాయంత్రం గానీ మార్కెట్‌కు వచ్చి కొనుగోలు చేసుకుపోతున్నారు. మరో రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉంటుందని వాతావరణ అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు కూడా.

గ్రామాల్లో చాటింపులు..

ఎండలు తీవ్రంగా ఉన్నాయని, రాబోయే రోజుల్లో మరింత తీవ్రంగా ఉంటాయని, ఎవరూ ఎండలో బయటకు రావద్దంటూ గ్రామాలలో అధికారులు చాటింపులు చేయిస్తున్నారు. ప్రజలను అప్రమత్తం చేయిస్తున్నారు. చిన్నకలువల గ్రామపంచాయతీ సిబ్బంది మెక్ పట్టుకుని ఎవరూ మధ్యాహ్నం పూట బయటకు రావద్దని, ఎండలు మండిపోతున్నాయని, ఎండలో తిరిగితే అస్వస్థతతోపాటు ప్రాణాపాయ పరిస్థితులు ఉంటాయని హచ్చరిస్తున్నారు. ఇలా పలు గ్రామాలలో ప్రజలను ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

నిర్మానుష్యంగా రోడ్లు..

కాగా, సుల్తానాబాద్ ప్రధాన మార్కెట్లు జనాలు లేక నిర్మానుష్యంగా మారాయి. ముఖ్యంగా కూరగాయల మార్కెట్, కాకా విగ్రహం నుంచి పోలీస్ స్టేషన్ రోడ్డు, రాజీవ్ రహదారి నెహ్రూ విగ్రహం నుంచి మున్సిపల్ ఆఫీసు వరకు ఉన్న రోడ్లన్నీ జన సంచారం కరువయింది. ఈ ఎండలకు కొనుగోలు దారులు రాకపోవడంతో పలువురు వ్యాపారులు తమ దుకాణాలు మధ్యాహ్నం మూసి వేస్తున్నారు.

శీతలపానీయాలకు పెరిగిన గిరాకీ..

ఎండలు మండిపోవడంతో ప్రజలు అందుబాటులో ఉన్న చల్లని పానీయాలను ఆశ్రయించి సేద తీరుతున్నారు. సుల్తానాబాద్ పట్టణంలో పదుల సంఖ్యలో వెలసిన శీతల పానీయాల విక్రయ కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. అలాగే చలువనిచ్చే పండ్లు కొనుగోలు చేస్తున్నారు.



సుల్తానాబాద్‌లో పుచ్చకాయలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఎస్సారార్‌లో బేసిక్ బ్యూటీషియన్ కోర్స్ సర్టిఫికెట్ల ప్రదానం

గణేశ్‌నగర్, మే 1: ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం బేసిక్ బ్యూటీషియన్ కోర్స్ సర్టిఫికెట్ల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ జయంతి అసోసియేట్ ప్రొఫెసర్ ప్రిన్సిపల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ శాతవాహన యూనివర్సిటీ ముఖ్య అతిథిగా విచ్చేసి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. సౌందర్యం యొక్క ఆవశ్యకతను పరిగణలో ఉంచుకొని ఈ కోర్సులో వారు నేర్చుకున్నటువంటి అంశాలను సద్వినియోగపరచుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రామకృష్ణ కోర్సును ఉద్దేశించి గత 10 సంవత్సరాలుగా నిరంతరాయంగా సాగుతున్నటువంటి ఈ కోర్సు ఎంతో మందికి ఉపాధిని కల్పించిందని మీరు కూడా అదే దిశగా నడక సాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగ అధిపతి శ్రీమతి ఉమా మహేశ్వరి మాట్లాడుతూ ఇంతటి గొప్ప విలువైన విద్యను నేర్పిన కళాశాలను విద్యార్థులను కోఆర్డినేటర్, రిసోర్స్‌పర్సన్ లీనాను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా బేసిక్ బ్యూటిషన్ కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ మన్నే శోభారాణి మాట్లాడుతూ బేసిక్ బ్యూటీషియన్ కోర్సుకు సంబంధించిన ప్రతి విషయం గురించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఏవో కామరాజు, లెక్చరర్స్ సోనియారెడ్డి, డాక్టర్ ప్రమీల,జూబ్లీ రెష్మిక, కోర్సు రిసోర్స్ పర్సన్ లీనా, కోర్సుకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

బాలభవన్ శిక్షణ శిబిరానికి స్పందన



నృత్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

కరీంనగర్ కల్చరల్, మే 1: జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతియేటా 5 నుంచి 16 సంవత్సరాల బాలబాలికలకు వేసవిలో నిర్వహించే శిక్షణా శిబిరం అంబేద్కర్ స్టేడియంలో జరుగుతోంది. శిబిరానికి చిన్నారుల నుంచి మంచి స్పందన వస్తోంది. చిత్రలేఖనం, పెన్సిల్ పేయింటింగ్స్, హాండ్ రైటింగ్, గాత్ర, కర్ణాటక సంగీతం, లలిత, దేశభక్తి గేయాలు, మృదంగం, తబల, కంజీర, జానపద, క్లాసికల్, సెమీ క్లాసికల్, వెస్టన్ నృత్యాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, బ్యూటీషియన్, మెహంది కోర్సులతో పాటు అబాకస్, చెస్, శాస్త్రీయ నృత్యం, యోగాల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలను శిక్షణకు పంపిస్తున్నారు. జూన్ 8వ తేదీ వరకు అంశాల వారీగా శిక్షణ ప్రతీరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగనుంది. పాత, కొత్త విద్యార్థులు కలిపి ప్రస్తుతం (ఏప్రిల్ 30వ తేదీ వరకు) 330 మంది వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారని బాలభవన్ సూపరెండెంట్ కట్ట మంజులాదేవి తెలిపారు. బాలబాలికలు ఆధార్ కార్డ్, ఫొటోతో సంప్రదించాలని కోరారు. ఈ మాసంలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నా రు. శిక్షణకు సహకరిస్తున్న జిల్లా కలెక్టర్, డీఈఓ, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులు, తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని, వాటర్ బాటిల్స్, స్నాక్స్ తెచ్చుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి టెబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు ఓవరాల్ చాంపియన్ షిప్



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే1: ఖమ్మం జిల్లాలోని సర్దార్ పటేల్ ఇండోర్ స్టేడియంలో ఏప్రిల్ 28,29,30 తేదీలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి టెబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన జీఎస్ అకాడమీ క్రీడాకారులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి క్యాడెట్ విభాగంలో చైత్ర కాంస్య పతకం, బాలికల విభాగంలో అవనిరెడ్డి, సత్య, సింధు, అనన్యలు రెండు బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకాలను సాధించారు. అలాగే ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో అజయ్, అవని రెడ్డి, రజిత పతకాలను సాధించారు. బాలుర విభాగంలో అజయ్, రెండు రజిత, ఒక కాంస్య పతకాన్ని, పురుషుల డబుల్స్‌లో అజయ్, చన్మయ్ రజత పతకాలను సాధించి ఈ పోటీల్లో కరీంనగర్ జిల్లాకు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించి పెట్టారని జీఎస్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ జి శరత్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సర్దార్ సురేందర్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జీఎస్ అకాడమీ ఉపాధ్యక్షుడు బి.శ్రీధర్ గౌడ్, బి మహేష్, యస్ మహిపాల్, సంయుక్త కార్యదర్శి వికాస్ కుమార్, కోశాధికారి గౌతంరెడ్డి, సభ్యులు రజనీకాంత్‌రెడ్డి, శ్రీకరచారి, సంతోష్, హర్ష అభినందించారు.

కోడలిని దారుణంగా హత్య చేసిన మామ


ఆకుల మౌనిక(ఫైల్)

సారంగాపూర్, మే1: మండలంలోని రేచపల్లి గ్రామంలో కోడలిని గొంతు కోసి మామ హత్యచేసిన ఘటన బుధవారం కలకలం రేపింది. ఈ హత్యకు సంబంధించిన వివరాలను రూరల్ సీఐ అరీఫ్ అలీఖాన్ వెల్లడించారు. రేచపల్లి గ్రామానికి చెందిన ఆకుల మౌనిక (25)ను కొత్తపల్లి లచ్చనాయక్ తండాకు చెందిన ఆకుల తిరుపతితో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. తిరుపతి జీవనోపాధి నిమిత్తం న్యూజిలాండ్ వెళ్లాడు. ఈ నెల 27న ఇద్దరు వ్యక్తులు మౌనిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి వేధింపులకు గురిచేశారు. దీంతో మౌనిక వేధింపులు తాళలేక స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మౌనిక ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదైంది. అయితే మౌనిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో తమ కుటుంబ పరువు పోయిందని మామ ఆకుల రాజిరెడ్డి కోడలిని మందలించాడు. ఇదే విషయమై ఆమెపై రాజిరెడ్డి కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మౌనిక ఇంట్లో నిద్రిస్తుండగా ఆరుబయట పడుకున్న మామ రాజిరెడ్డి పథకం ప్రకారం ఉదయం 5 గంటల సమయంలో కత్తితో మౌనిక గొంతు కోసి హత్య చేశాడు. దీంతో మౌనిక అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. తండ్రి తోట రాజయ్య ఫిర్యాదు మేరకు మామ రాజిరెడ్డి, అత్త గంగవ్వ, భర్త తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో దివ్యాంగ బాలుడి మృతి

రామడుగు, మే 1: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన కళ్లెం యశ్వంత్ (5) అనే దివ్యాంగ బాలుడు బుధవారం వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కళ్లెం అంజయ్య, పుష్ప దంపతుల కుమారుడు యశ్వంత్ పుట్టినప్పటి నుంచి అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. బాలుడి కోసం దంపతులు పెద్ద ఎత్తున ఖర్చు చేశారు. అంతక్రియలు నిర్వహించడానికి ఇబ్బందిగా ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మా ఆస్తులను అప్పగించే అధికారం లేదు

● కొండగట్టు అధికారులకు విన్నవించిన సిద్దిపేట జిల్లా వాసులు ● గతంలో 2.20 ఎకరాలు దానం చేస్తానని ప్రకటించిన భక్తుడు

మల్యాల, మే 1: మా ఆస్తులను కొండగట్టు ఆలయానికి దానం చేస్తానని ప్రకటించిన తమ తండ్రి మాటలను పరిగణలోకి తీసుకోవద్దని సిద్దిపేట జిల్లాకు చెందిన కుటుంబ సభ్యులు బుధవారం కొండగట్టుకు వచ్చి అధికారులకు విన్నవించారు. తన కొడుకు తనను సాకడం లేదని తన ఆస్తిని కొండగట్టు అంజనేయస్వామికి దానం చేయడానికి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌కు చెందిన కొప్పెర బాపురెడ్డి గత నెల 24న ఆలయానికి వచ్చాడు. ఆస్తి పత్రాలను హుండీలో వేయడానికి ప్రయత్నించాడు. గమనించిన అక్కడి సిబ్బంది అడ్డుకున్నారు. ఈ క్రమంలో అతని కుటుంబ సభ్యులు బుధవారం కొండగట్టుకు వచ్చి అధికారులను కలిసారు. ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేక తన భర్త తమ ఆస్తులను కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానానికి దానం చేస్తానని తెలిపాడని బాపురెడ్డి భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులు దేవస్థానం అధికారులకు తెలిపారు. ఈ మేరకు అతడి భార్య లక్ష్మి, కుమారుడు ప్రవీణ్‌కుమార్, కూతుళ్లు మల్లీశ్వరి, స్వరూప ఈవో చంద్రశేఖర్‌కు భూదానంపై ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవద్దని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆరోగ్య పరిస్థితి సరిగా లేని బాపురెడ్డి తమ కుటుంబ ఆస్తులను దానం చేస్తానని ఇటీవల కొండగట్టుకు వచ్చి ప్రచారం చేయడాన్ని పరిగణలోకి తీసుకోవద్దని కోరారు. తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆ ఆస్తులు తమకు మాత్రమే సంక్రమిస్తాయని అతడికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. దీనిపై దేవస్థానం అధికారులు తమను సంప్రదించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరారు. బాపురెడ్డి 2.20 ఎకరాలకు సంబంధించిన పత్రాలు తదితరవి హుండీలో వేయాలని ప్రయత్నించాడు.


కొండగట్టు ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కుటుంబ సభ్యులు

హుండీలలో వేస్తే ప్రయోజనం లేదని అధికారులు తెలుపగా దేవాలయం పక్కన రామాలయం నిర్మిస్తే ఆ భూమిని దానం చేస్తానని బాపురెడ్డి బాండ్‌పేపర్ రాసిచ్చాడు. పాసుపుస్తకం అందించగా దేవస్థానం అధికారులు రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. దీంతో కుటుంబసభ్యులు బుధవారం వచ్చి బాపురెడ్డి తమతో 15ఏళ్లుగా ఉండడం లేదని భూమి దానంకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరారు.

మంథని సబ్‌స్టేషన్‌లో ఫీడర్ బ్రేకర్ సిటీ బ్లాస్ట్


ఫీడర్ బ్రేకర్ వద్ద మంటలు

మంథని, మే 1: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీలో మండలంలోని కాకర్లపల్లి ఫీడర్ సిటీ బ్లాస్ట్ కావడంతో బుధవారం విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ ఫైరింగ్ కావడంతో మంథని టౌన్‌తో పాటు కాకర్లపల్లి సూరయ్యపల్లి, గంగాపురి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయంలో వెంటనే స్పందించిన పెద్దపల్లి ఎస్సీ బొంకూర్ సుదర్శన్ సబ్‌స్టేషన్ సందర్శించి మంథని డీఈ ఈశ్వర ప్రసాద్, ఏఈ చిన్నాల మల్లయ్యలతో పరిస్థితిని సమీక్షించారు. ఉదయం 10 గంటలకు బ్లాస్టింగ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగగా ఎస్సీ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించి 11 గంటలకు సరఫరా చేశారు. ఫీడర్ బ్రేకర్ సిటీ బ్లాస్ట్ కావడంతో ఫైర్‌స్టేషన్ అధికారి సదానందం తమ సిబ్బందితో చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

చేపలు పట్టడంపై రెండు గ్రామాల మధ్య వివాదం

మల్యాల,మే1: మండలంలోని పోతారం చెరువులో చేపలు పట్టడంపై పోతారం, గొల్లపల్లి గ్రామ వాసుల మధ్య గత రెండు రోజులుగా వివాదం నెలకొంది. మంగళవారం పోతారం చెరువులో చేపలు పట్టగా పోతారానికి చెందిన కొందరు లాక్కెళ్లినట్లు గొల్లపల్లికి చెందిన గంగపుత్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం పోతారానికి చెందిన వాల్మికి బోయ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. ఇరు గ్రామాల వాదనలు విన్న పోలీసులు మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివాదంను అధికారులు పరిష్కరించాలని ఇరు గ్రామాల మధ్య గొడవలు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 1: కరీంనగర్ రూరల్ మండలం ఫకీర్‌పేట, చెర్ల బూత్కూర్ గ్రామాల్లో బుధవారం కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 603 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడింది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టీ డేవిడ్ రవికాంత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావుల ఆదేశాలు మేరకు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కే నాగేశ్వరరావు అధ్వర్యంలో రెండు గ్రామాల్లో దాడులు నిర్వహించి ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఫకీర్‌పేటకు చెందిన అడపా వంశీ, మనకొండూరు మండలం వేగురుపల్లికి చెందిన తప్పెట నితీష్‌కుమార్‌లను అరెస్టు చేయగా కరీంనగర్ కాశ్మీర్ గడ్డకు చెందిన ఎండీ ఉమర్ అలియాస్ నోమన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన వారి వద్దనుంచి 603 గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. చర్లభుత్కూర్ గ్రామంలో గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ ఐదుగురు వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసేందుకు కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్‌లో


నిందితులను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ నాగేశ్వరరావు

అప్పగించామని తెలిపారు. ఈ దాడులలో హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్ల కుమార్ యాదవ్, ఖాసింబి, కమలాకర్, వర్మ, జీవన్, ట్రైనీ కానిస్టేబులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే స్కాముల పార్టీ

భగత్‌నగర్, మే 1: కాంగ్రెస్ పార్టీ అంటేనే స్కాముల పార్టీ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి విమర్శించారు. బుధవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2జీ, సహారా, బొగ్గు, ఈఎస్ఐ స్కాంలతో దేశాన్ని భ్రష్టుపట్టించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పెద్ద అవినీతిపరుడని ఆరోపించారు. ఓ ట్రావెల్స్ అధినేత నుంచి కోటిన్నర విలువైన కారు, ఎన్టీపీసీ బూడిద తీసుకెళ్లే లారీలను ఆపి కాంట్రాక్టర్‌ను బెదిరించి మొదట రెండు కోట్లు, ఆ తర్వాత 6 కోట్లు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మంత్రితో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇద్దరు కాంట్రాక్టర్‌ను బెదిరించి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇచ్చినందుకు వెలిచాల రాజేందర్‌రావు వద్ద కోట్లాది రూపాయలు డబ్బులు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం అవినీతి, వ్యవహార శైలి చూస్తుంటే కాంగ్రెస్ నేతలే అసహ్యించు కుంటున్నారన్నారు. నాటి మంత్రి గంగులతో లాలూచీ పడి 5 కోట్లు తీసుకుని హుస్నాబాద్‌కు పారిపోయాడన్నారు. జర్నలిస్టులకు టీపీఎల్ కోటా కింద ఇచ్చిన భూములపై కన్సెసి లేని వివాదాన్ని సృష్టించిన మాట నిజం కాదా అన్నారు. బూడిద స్కాంపై అవసరమైతే సీబీఐకి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

లేఖ రాస్తామన్నారు. రిజర్వేషన్లపై ఫేక్ వీడియోలు సృష్టించి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్న నీచమైన పార్టీ కాంగ్రెస్‌పార్టీ అన్నారు. ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్‌కుమార్ మాట్లాడుతూ 54 సంవత్సరాలు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ రిజర్వేషన్లకు తూట్లు పొడి చిందన్నారు. మోదీ ప్రధాని అయ్యాక గ్రామాలకు కరెంట్ సౌకర్యం కల్పించ డంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

గంగాధర, మే 1: గంగాధర మండలం గట్టుబూత్కూర్ చెరువులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన తూర్పటి మైసయ్య(27), అతని బావ పత్తి ముత్యాలు ఇద్దరు గంగాధర మండలం గట్టుబూత్కూర్ చెరువులో చేపలు పట్టేందుకు బుధవారం వెళ్లారు. ఇద్దరు చెరువు కట్టపై మద్యం సేవించిన అనంతర తూర్పటి మైసయ్య చేపల కోసం చెరువులోకి దిగాడు. మద్యం మత్తులో చెరువులోకి దిగి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి చెల్లె గంగ పిర్యాధుమేరకు కేసు నమోదు చేసి ధర్యాప్త చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

● తప్పిన ప్రమాదం

సుల్తానాబాద్, మే 1: ఓ కుటుంబం కారులో దైవదర్శనానికి వెళ్లివస్తుండగా కారు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. సింగరేణి అండ్రియాల ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న ఓ కార్మికుడి కుటుంబం మొక్కు చెల్లించడానికి ఏప్రిల్ 27 తిరుమలకు కారులో వెళ్లారు. తిరిగి వస్తుండగా సుల్తానాబాద్ పట్టణంలో రాజీవ్ రహదారి వద్ద ఐబీ చౌరస్తా దాటిన తర్వాత మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. కారు ముందు టైర్ పేలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న కొందరికి స్వల్పగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని కారును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రాజీవ్ రహదారిపై ఘటన జరుగడంతో కారులో ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు.

అక్కా చెల్లెళ్ల అదృశ్యం

మల్యాల,మే 1: మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు అదృశ్యమైనట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. ఓబులాపూర్‌కు చెందిన బొజ్జ బాబు భార్య లక్ష్మి గత 25 రోజుల క్రితం మృతి చెందగా కూతుళ్లు వైష్ణవి(17), ప్రసన్న(15)లతో బాబు ఉంటున్నాడు. మంగళవారం రాత్రి మేడపైన ముగ్గురు పడుకోగా బాత్రూంకు వెళ్లి వస్తామని చెప్పి కిందకు దిగిన అక్కాచెల్లెళ్లు ఇంటి నుంచి వెళ్లిపోయారు. తిరిగి రాకపోవడంతో తండ్రి చుట్టుపక్కల ఇళ్లు, పలు చోట్ల వెతికాడు. ఆచూకీ లభించకపోవ డంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలికల తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, మే 1: ప్రేమ విఫలం అవడంతో పాటు అనారోగ్య సమస్యలతో బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, యువకుడి బంధువుల కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ సజన్ (23) గత కొంతకాలంగా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని పెట్రోల్ బంక్ పక్కన తాత్కలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని పంక్చర్ షాపు నిర్వహిస్తున్నాడు. గతంలో ఓ అమ్మాయి ప్రేమలో పడగా అది విఫలం అవడంతో ఆత్మహత్య ప్రయత్నం చేయగా కుటుంబ సభ్యు లు అడ్డుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు. అప్పటి నుంచి మనోవేద నకు గురవడంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీంతోతీవ్ర మనస్థాపానికి గురై పంక్చర్ నిర్వహించే షెడ్డులో ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని సమీప బంధువులు పెద్దూర్ గ్రామానికి చెందిన సమీర్ పోలీసులకు మృతుని వివరాలను, ఆత్మహత్యకు గల కారణాలను వెల్లడించారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

మల్యాల, మే 1: కరీంనగర్-జగిత్యాల మార్గంలోని రాజారం ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఓ లారీ ఇంట్లోకి దూసుకెళ్లింది. కరీంనగర్ వైపు నుంచి జగిత్యాల వస్తున్న లారీ అదుపుతప్పి రహదారి పక్కన గల బక్కశెట్టి పెద్ద గంగారాం అనే వ్యక్తి ఇంట్లోకి దూసుకెళ్లింది. దీంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పగా ఇంటి ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది.

పంట పొలాల్లో చెలరేగిన మంటలు


మంటలను ఆర్పుతున్న రైతులు, పోలీసులు

సుల్తానాబాద్ మే 1: ధాన్యం లోడ్‌తో వస్తున్న ఓ లారీ తాకడంతో విద్యుత్ వైర్లు తెగి పంటపొలాల్లో పడ్డాయి. దీంతో మంటలు వ్యాపించి పంట పొలాలు అగ్నికి ఆహుతయ్యాయి. కదంబాపూర్ నుంచి ధాన్యం బస్తాల లోడ్‌తో రైల్వే ట్రాక్ వెంట వస్తున్న ఓ లారీకి పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. దాంతో తీగలు పొలాలపై పడిపోయి మంటలు అంటుకున్నాయి. దాదాపు పది ఎకరాల్లో మంటలు అంటుకుని లక్ష రూపాయల వరకు నష్టం కలిగినట్లు రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతులతో కలిసి మంటలను ఆర్పడంలో సహకరించారు. పెద్దపల్లి నుంచి వచ్చిన ఫైరింజన్ మొరాయించడంతో సిబ్బంది కూడా పోలీసులు, రైతులతో కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య


రంగు తిరుపతి (ఫైల్)

ఇల్లందకుంట, మే 1: మండల కేంద్రానికి చెందిన రంగు తిరుపతి (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట గ్రామానికి చెందిన రంగు తిరుపతి, కవిత దంపతులకు ఇరువురు సంతానం ఉన్నారు. ఇరువురి మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మానసికంగా కుంగిపోయిన తిరుపతి మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కూతురు రంగు కీర్తన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ పేర్కొన్నారు.

బీఎస్సీ ఆనర్స్ రెండో సెమిస్టర్ పరీక్ష రుసుం గడువు 7 వరకు

గణేశ్‌నగర్,మే1: ఎస్‌యూ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ రెండో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్ష రుసుం చెల్లించడానికి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా 7వ తేదీ వరకు తుది గడువు అని, 300/- ల అపరాధ రుసుంతో 10వ తేదీ వరకు చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలను జూన్‌లో నిర్వహించనున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

మెట్‌పల్లి, మే 1: పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో భూక్య భూమయ్య(55) అనే వృద్ధుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన భూక్య భూమయ్య పనుల నిమిత్తం మెట్‌పల్లికి వచ్చాడు. పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచనల మేరకు నిజామా బాద్ ఆసపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి భూమయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

వంశీకృష్ణను గెలిపించాలని ప్రచారం

యైటింక్లయిన్‌కాలనీ, మే 1: పెద్దపల్లి ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కోరారు. బుధవారం స్థానిక అబ్దుల్ కలాం స్టేడియంలో వాకర్స్‌ని కలిసిన ఎమ్మెల్యే పరిచయం చేసుకుంటూ వారితో మాట్లాడారు. మారెల్లి రాజిరెడ్డి, గుండేటి రాజేష్, శంకర్‌నాయక్, సాగంటి శంకర్, సత్యనారాయణ రెడ్డి, దుర్గాప్రసాద్, దామోదర్ రావు, చక్రపాణి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

కొప్పులకు మద్దతుగా టీబీజీకేఎస్ ప్రచారం..

బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా టీబీజీకేఎస్ నాయకులు బుధవారం కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఆర్జీ-2 వైస్‌ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బేతి చంద్రయ్య, అనిల్‌రెడ్డి, లింగారెడ్డి, కమలాకర్, శ్రీకాంత్, తిరుపతి, రాంచరణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పేదలకు న్యాయం

సుల్తానాబాద్, మే 1:కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైతే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మం డలంలోని గొల్లపల్లి, నారాయణరావుపల్లి, సాంబయ్యపల్లి, గర్రెపల్లి, నర్సయ్యపల్లి, బొంతకుంటపల్లి, నీరుకుళ్ళ గ్రామాల్లో విజయరమణారావు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాయంత్రం సుల్తానాబాద్ మార్కండయ్య కాలనీ, గొల్లపల్లిలోనూ ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

ముత్తారం, మే 1:మండలంలోని ఖమ్మంపల్లిలో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను ఆశీర్వదించాలని కోరారు.

కాంగ్రెస్‌కు మాదిగ హక్కుల దండోరా మద్దతు

కమాన్‌పూర్, మే 1 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాదిగ హక్కుల దండోరా సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని, పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. సంఘం ఉపాధ్యక్షులు వద్మారి శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ కండె కుమార్, నాయకులు తోకల మల్లేష్, కుక్క రవీందర్, రాయమల్లు మంథని, రామస్వామి, కల్వల ప్రకాష్, చిప్పకుర్తి కనకయ్య, చిప్పకుర్తి శంకర్‌లు ఉన్నారు.

కేసీఆర్ హయాంలోనే మెరుగైన పరిపాలన

కమాన్‌పూర్, మే 1 : కేసీఆర్ హయాంలోనే మెరుగైన పాలన అందించారని, పెద్దపల్లి ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి ఈశ్వర్‌ను గెలిపించాలని ఎంపీపీ రాచకొండ లక్ష్మీ అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. మాజీ జడ్పీటీసీ మేకల సంపత్‌యాదవ్, మాజీ సర్పంచులు నీలం సరిత, తాటికొండ శంకర్, కొండ వెంకటేష్, ఆకుల గట్టయ్య, ఏఎంసీ వైస్‌చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు తదితరులు ఉన్నారు.

మంత్రి సభను విజయవంతం చేయాలి

కమాన్‌పూర్, మే 1:మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గురువారం జరగనున్న మంత్రి శ్రీధర్‌బాబు సభను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైనాల రాజు కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని పార్లమెంట్ ఎన్నికలో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గాండ్ల మోహన్, శేఖర్, కుక్క రవీందర్, కొంతం శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, చాట్ల రాయమల్లుతో పాటు తదితరులు ఉన్నారు.

ఈశ్వర్‌ను గెలిపించాలని ప్రచారం

పెద్దపల్లి రూరల్, మే 1 : పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని రాంపల్లి, భోజన్నపేట, హన్మంతునిపేట, సబ్బితం గ్రామాల్లో మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్క లక్ష్మణ్, వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ప్రచారం

ఓదెల, మే 1 :మండలంలోని భీమరపల్లి, గూడెం గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, రంగు మల్లేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

పెద్దపల్లి రూరల్, మే 1 : పెద్దపల్లి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్‌ను గెలిపించాలని బిజేపి మండల అధ్యక్షులు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మండలంలోని రాఘవపూర్‌లో బీజేపీ నాయకులు ఉపాధి కూలీలను కలిసి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రమేష్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీధర్, రమాకాంత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే వేడుకలు


మేడే ఉత్సవాల్లో పాల్గొన్న సీఐటీయూ నాయకులు



మేడే వేడుకల్లో పాల్గొన్న ఏఐఎఫ్‌టీయూ నాయకులు


ఎర్ర జెండాను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

పెద్దపల్లి కల్చరల్, మే 1 : మే డే వేడుకలు జిల్లా కేంద్రంలో బుధవారం ఘనంగా జరిగాయి. సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ తదితర పార్టీలన్నీ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించాయి. రైల్వేహమాలీ కార్మిక సంఘం, వ్యవసాయ మార్కెట్ యార్డు కార్మిక సంఘం, అసంఘటిత కార్మిక రంగం అందరూ సంయుక్తంగా ఎర్రజెండాలను ఎగురవేసి నివాళులు అర్పించారు. సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికులు బిల్డింగ్ వర్కర్స్ ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్ సంఘాల ఆధ్వర్యంలో ఆయా ఆఫీసుల వద్ద ఎర్రజెండాలు ఆవిష్కరించారు. మున్సిపల్‌ఆఫీసు నుంచి జెండాచౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు శ్రావణపెల్లి వెంకటస్వామి, మహంకాళి సురేష్, బొంకూరి సాగర్, సుద్దాల సతీష్,కుక్క అన్వేష్, మద్దెల రాజయ్య, కర్ణాకర్, రమా, చింతల మరియా, నలిగంటి పద్మ, పల్లె రవి,రాజేష్, కొమరయ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ : రామగుండంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో, అశోక్‌నగర్, గంగానగర్, సీఎస్‌పీకాలనీ, సీతానగర్, మల్లికార్జున్‌నగర్, విఠల్‌నగర్, చంద్రశేఖర్‌నగర్, కాకతీయనగర్‌లలో ఈదునూరి నరేష్ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐ కృష్ణ, కొమురయ్య, దుర్గయ్య, వెంకన్న పాల్గొన్నారు. భాస్కర్‌రావు


సుల్తానాబాద్‌లో మేడే వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

భవన్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు హాజరై జెండావిష్కరించారు. గౌతం గోవర్ధన్, మార్కపురి సూర్యగోషిక మోహన్ పాల్గొన్నారు. టీఎన్‌టీయూసీ కార్యాలయంలో మేడే వేడుకలను నిర్వహించారు. నాయకులు నిమ్మకాయల ఏడుకొండలు, దామోదర్‌రెడ్డి, చల్లా రవీందర్, కంది చంద్రయ్య, చిటికెల రాయలింగు, రాజనర్సు, స్వరాజ్యం, కళావతి, అశ్విని పాల్గొన్నారు. ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో యైటింక్లయిన్, ఎల్‌బీనగర్, విఠల్ నగర్, 7బీ కాలనీల్లో రాయమల్లు, విశ్వనాథ్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. రత్నకుమార్, రామస్వామి, మల్లేషం, కృష్ణస్వామి, చిన్నయ్య పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వేల్పుల కుమారస్వామి జెండావిష్కరణ చేశారు. శివ, సంజీవ్, సతీష్, కృష్ణ, జమున, నాగమణి, భాగ్య, మహేశ్వరి పాల్గొన్నారు.

జ్యోతినగర్ : మేడేను ఎన్టీపీసీలో ఘనంగా నిర్వహించారు. ఆటోనగర్‌లో ఐఎఫ్‌టీయూ కార్యాలయం ముందు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న, ఎన్టీపీసీ 2వ గేటు వద్ద జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు రాజన్న, శంకర్, కె.జ్యోతి(పీవోడబ్ల్యు), నాయకులు ఆర్.రాయమల్లు, సుధాకర్, కుమార్, రవి, రవిందర్, మహేందర్, మొండయ్య, రమేష్, వెంకటస్వామి, సత్యం, వసంత్, రాజేశం, శంకర్, మురళి, శ్రీనివాస్, కవిత పాల్గొన్నారు. సీఐటీ యూ ఆధ్వర్యంలో మేడేను ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ 2వ గేటు, యాష్ పాండు వద్ద ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాంసాని శంకర్, మార్కెట్ ఏరియాలో పోచం, మేడిల్లిసెంటరులో కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి ఎర్ర జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో దండ రాఘవరెడ్డి, మల్లేశ్, రాజ్‌కు మార్, భూమయ్య, బిక్షపతి, రవిందర్, షమీం, శంక రయ్య, శ్రీనివాస్, శంకరాచారి, విజయ్ పాల్గొన్నారు.


కాసులపల్లిలో మే డే వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మంథని : మేడేను పురస్కరించుకొని మంథనిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. మంథని ఆర్టీసీ డిపో వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్, అనంతరం గాంధీచౌక్‌లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్ రెడ్డి, న్యాయవాది, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కే.రగోతంరెడ్డి, మంథని విద్యార్థి వ్యవస్థాపక అధ్యక్షుడు కొండెల మారుతి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అర్ల సందీప్‌లు హాజరయ్యారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, వైస్‌చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసి సత్కరించారు.

ముత్తారం : మండలంలోని ముత్తారం, ఓడెడ్, మచ్చుపేట, లక్కారం, మైదంబండ, అడవి శ్రీరాంపూర్ గ్రామాల్లో హమాలీ సంఘం ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో, అడవిశ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండల కేంద్రంతోపాటు పలుగ్రామాల్లో మేడే వేడుకలను కార్మికులు, కర్షకులు ఘనంగా నిర్వహించారు. ఎర్రజెండాలను ఎగురవేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సుల్తానాబాద్ : మే డేను పురస్కరించుకుని సుల్తానాబాద్‌లో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎర్ర జెండా ఎగురవేశారు. పాక మహేష్, నల్ల శ్రీనివాస్, బత్తిని క్రిష్ణ, విజయ్,న్యాతరి రాజు, కుమార్, శ్రావణ్, లక్ష్మి, రాజేశ్వరి, సురేష్, రాంమ్మూర్తి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. సుల్తానాబాద్ రైస్‌మిల్స్ అపరేటర్స్, గుమస్తాల సంఘం, లారీడ్రైవర్లు, ఆటోకార్మికులు ఎర్ర జెండాలు ఎగురవేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ముత్యంరావు, వివిధ సంఘాల అధ్యక్షులు తాండ్ర అంజయ్య, మాతంగి రాజమల్లు, పోగుల తిరుపతి, బ్రహ్మచారి, బాలక్రిష్ణ, మంజూర్, మునీర్, స్వామి, ర మేష్, తిరుపతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : మేడేను పురస్కరించుకొని మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సీఐటీయూ జెండాను అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు టీ. కృష్ణకుమారి ఆవిష్కరించారు. నాయకులు జ్యోతి, రాజయ్య, కుమారి, రాధ, రాజకుమారి తదితరులు ఉన్నారు.

ఓదెల : మండల కేంద్రంతోపాటు కొలనూర్, హరిపురం గ్రామాలల్లో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓదెలలో సీపీఐ మండల కార్యదర్శి కోడం స్వామి కార్మిక జెండాను ఆవిష్కరించారు. కొలనూర్‌లో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవి గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. సామ శంకర్, కుంచం మల్లయ్య, పల్లె గట్టయ్య, మద్యల నరసయ్య, దొడ్డే శంకర్, స్వామి, గోలి చంద్ర మౌళి, హమాలీ సంఘం నాయకులు లింగయ్య, శంకర్, సీపీఐ నాయకులు పల్లె గట్టయ్య, పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాసులపల్లిలో సీఐటీయూ హమాలి కార్మికుల ఆధ్వర్యంలో జెండాలను ఎగరేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కల్లెపల్లి అశోక్, గద్దల శేఖర్, గద్దల రాజు, సతీష్, శ్రవణ్ లింగయ్య, రాజు, కుమార్ రాజేశం పాల్గొన్నారు. ఎంపీడీవో ఆఫీస్ ముందు తెలంగాణ గ్రామపంచాయతీ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాను సీనియర్ కార్మికుడు రాజయ్య ఎగురవేశారు. సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి జ్యోతి, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి కాజా, జంగపెల్లి నరేష్, బందరి అశోక్, మండేద్దుల సదయ్య, ఎండి ముస్తఫా, రేకుంట్ల సందీప్, బండ రాజయ్య పాల్గొన్నారు.

జూలపల్లి : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎర్రజెండాలను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్మికులు కొట్టె సంజీవ్, ముమ్మాడి రవి, ఎండి అపీజ్, ఆసంపెల్లి బానయ్య, వైద్య సంపత్, ఎండి అప్సర్, చిప్ప సత్యం, మల్లారపు నాగయ్య, మానుమండ్ల కనుకయ్య పలువురు పాల్గొన్నారు.


కార్మికులకు వస్త్రాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


ఎన్టీపీసీలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ర్యాలీ


మంథనిలో మేడే వేడుకల్లో పాల్గొన్న కార్మికులు


జూలపల్లిలో జెండా ఎగురవేస్తున్న కార్మికులు

'బీఆర్ఎస్ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలి'

మంథని, మే 1: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకే తమ మద్దతు అని మున్నూరు కాపు సంఘం మహాసభ జిల్లా కన్వీనర్ ఇనుముల సతీష్, తెలంగాణ మున్నూరు కాపు సంఘం డివిజన్ కోఆర్డినేటర్ ఆకుల కిరణ్ పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ. పెద్దపెల్లి పార్లమెంటు నియోజకవర్గంలో ఉన్న మున్నూరు కాపుల మద్దతు గడ్డం వంశీకృష్ణకు తెలుపుతున్నట్లు వెల్లడించారు. మున్నూరుకాపు సంఘం నాయకులు, మున్నూరు కాపు ప్రజలు వంశీకృష్ణకు మద్దతు పలికి హస్తం గుర్తుకు ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షులు కొట్టే రమేష్ పాల్గొన్నారు.

కరస్పాండెంట్ కుటుంబానికి ఆర్థిక సహాయం


వేణుగోపాలస్వామి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న వాక్ ప్రతినిధులు

కోల్‌సిటీటౌన్, మే 1: విద్యారంగంలో 45ఏళ్ళకు పైగా విద్యాసేవలందించి ఇటీవల మరణించిన నిరుపేద కరస్పాండెంట్, ఉపాధ్యాయుడు వేణుగోపాల స్వామి కుటుంబానికి వాక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ కరస్పాండెంట్స్ ఆధ్వర్యంలో బుధవారం రూ.50వేల ఆర్థిక సహాయం అందించారు. వేణుగోపాలస్వామి కుటుంబ సభ్యులు కూతుళ్ల భవాని, భార్గవిలకు రూ.50వేల నగదును వాక్ కన్వీనర్ అరుకాల రామచంద్రారెడ్డి, కో ఆర్డినేటర్ మొక్క రాజయ్య చేతుల మీదుగా అందజేశారు. రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బండారి రాజమల్లు, అదర్‌సండే సమ్మారావు, ఆడప బాపురెడ్డి, కంది రవీందర్‌రెడ్డి, పి.అంజారెడ్డి, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, చందుపట్ల తిరుపతిరెడ్డి, రత్నాకర్, కళాధర్‌రెడ్డి, శంకర్, ఎస్.జ్యోతి, వాక్ సభ్యులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో షార్ట్ సర్క్యూట్

-జనరేటర్ దగ్ధం

సుల్తానాబాద్, మే 1: సుల్తానాబాద్ మండలంలోని బొంతకుంటపల్లిలోని స్రవంతి రైస్‌మిల్లులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ మూలంగా జరిగిన ప్రమాదంలో జనరేటర్ పూర్తిగా కాలిపోయింది. బుధవారం ఉదయం స్రవంతి రైస్ మిల్లులో జరిగిన ఈ ప్రమాదంలో జనరేటర్ గదిలో మంటల రావడంతో కార్మికులు మంటలను అదుపు చేయలేకపోయారు. అప్పటికే జనరేట్ పూర్తిగా కాలిపోయిందని రూ.12 లక్షలు నష్టం వాటిల్లిందని రైస్ మిల్లు యజమాని శ్రావణ్ తెలిపారు. మంటలు మిల్లులోని ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అన్నారు.

ఖోఖో శిక్షణ కేంద్రానికి సహకారం

సుల్తానాబాద్, మే1: కేంద్ర ప్రభుత్వం అధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా వారి ఖోఖో శిక్షణ కేంద్రానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, పెద్దపల్లి జోడో సంఘం ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్‌లు అన్నారు. బుధవారం సుల్తానాబాద్ ఖోఖో సెంటర్ కోచ్ అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారులు గెల్లు మధుకర్ యాదవ్‌ను సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుల్తానాబాద్ ఖోఖో శిక్షణ కేంద్రానికి ఒక అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు కోచ్‌గా ఉండడం సంతోషకరమైనదని అన్నారు. క్రీడాకారులు వీరి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెంటర్ నిర్వహిస్తున్న తీరును వారు మధుకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ ఖేలో ఇండియా వారి ఖోఖో శిక్షణ కేంద్రానికి ఎలాంటి సహాయసహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


వాలీబాల్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులు

సుల్తానాబాద్, మే 1: సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి జడ్పీ హైస్కూల్ మైదానంలో గురువారం వాలీబాల్ వేసవి కాల శిక్షణ శిబిరాన్ని హెచ్‌ఎం కవిత, తెలంగాణ రాష్ట్ర సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు కన్నా రమేష్, గౌతమ్‌లు ప్రారంభించారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు అస్లం, నవీన్ పీఈటీలు ఎండీ ఆసియా బేగం, సీనియర్ క్రీడాకారులు రామక్రిష్ణ, నవీన్, మణిదీప్, ప్రేమ్, మారుతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

పెద్దపెలి రూరల్, మే 1: పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో బుధవారం ఉపాధిహామీ కూలీలకు మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్స్ లిటరసీ ఎస్.సంధ్య పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎండదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సి.హెచ్.శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

బేగంపేట్ మాజీ సర్పంచ్ భర్తపై దాడి

-పోలీసులకు ఫిర్యాదు

రామగిరి, మే 1: మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త బుర్ర శంకర్‌పై స్థానిక కాంగ్రెస్ నాయకుడు దాసరి శివ దాడికి పాల్పడినట్లు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుర్రశంకర్ ఫిర్యాదు చేశారు. మే డేను పురస్కరించుకొని జెండా ఆవిష్కరణకు గ్రామానికి చెందిన స్థానిక కార్మికులు పలు పార్టీలకు చెందిన నేతలకు ఆహ్వానం పలికారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు హాజరయ్యారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారం రథంలోని కళాకారుల పాటలు పాడడాన్ని దాసరి శివకుమార్ అడ్డు చెప్పడంతో సర్పంచ్ భర్త బుర్ర శంకర్‌కు మధ్య ఘర్షణకు కారణమైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనలో మాజీ సర్పంచ్ భర్త బుర్రశంకర్‌కు కనుబొమ్మపై గాయం అయ్యింది. ఈమేరకు దాసరి శివతో పాటు పలువురిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలి'

సుల్తానాబాద్, మే 1: మున్నూరుకాపు కులస్తులు అన్ని రంగాలలో రాణించి ఆర్థికంగా ఎదగాలని, పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ప్రముఖ అంతర్జాతీయ స్థాయి ఇంద్రజాలికులు, గిన్నిస్ బుక్ రికార్డుల గ్రహీత సామల వేణు అన్నారు. సుల్తానాబాద్ పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్వర్యంలో సామల వేణుకు సన్మాన సభ నిర్వహించి ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఎల్ రాజయ్య, పెద్దపల్లి ఎంపీపీ రాంమ్మూర్తి జిల్లా సంఘం అధ్యక్షులు మల్క రామస్వామి, గాజుల రాజమల్లు, ఉప్పు రాజు,శ్రీగిరి శ్రీనివాస్, క్రిష్ణ, మనోహర్, ముత్యాలు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి బోనాలు

పెద్దపల్లి రూరల్, మే1: మండలంలోని హన్మంతునిపేటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.



ఆర్జీ-2లో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, మే 1: వర్క్‌పీపుల్ అండ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆర్జీ-2 ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని బుధవారం జీఎం సూర్యనారాయణ ప్రారంభిచారు. శిక్షణకు వచ్చిన చిన్నారులను పరిచయం చేసుకుని వారిని ఉద్దేశించి జీఎం మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఏదైనా ఒక క్రీడలో నైపుణ్యత సాధించేలా సాధన చేయాలని, ఆటల ద్వారా శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్ బాల్‌లో ఆసక్తి ఉన్న ఆటను ఎంచుకుని 25 రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, ఎస్వోటూ జీఎం వెంకటేశ్వరరావు, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సీఎంఓఏఐ ప్రతినిధి రాంరెడ్డి, ఎస్ఎస్ఓ మహ్మద్ షరీఫ్, స్పోర్ట్స్ సెక్రెటరీ వేణుగోపాల్, సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త భూగర్భ గనులను ఏర్పాటు చేయాలి

కాసిపేట, మే 1: సింగరేణిలో కొత్త భూగర్భ గనులను ప్రారంభించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్‌కార్యదర్శి దాగం మల్లేష్ అన్నారు. బుధవారం కాసిపేటలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో భూగర్భ గనులు తగ్గిపోయాయన్నారు. గతంలో లక్ష మంది ఉన్న కార్మికులు ఇప్పుడు 40వేలకు చేరుకున్నారన్నారు. వెంటనే భూగర్భ గనులను ప్రారంభించి ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఈ ప్రాంతంలో నిరుద్యోగం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రాజేందర్, సంతోష్, కమలాకర్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మే డే స్ఫూర్తితో పనిచేద్దాం..

మందమర్రి టౌన్, మే 1: మే డే, అమరుల స్ఫూర్తితోనే ముందుకు సాగుతున్నామని రాష్ట్ర కనీస వేతనమండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆదిజాంబవ సంఘం ఆధ్వర్యంలో స్థానికకార్యాలయంలో కలిసిశాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులహక్కుల సాధనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఆ సంఘం నాయకులు వాసాల శంకర్, సభ్యులతోపాటు రాజేషం, కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలు

ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య


అరుణపతాకాన్ని ఆవిష్కరిస్తున్న మిర్యాల రాజిరెడ్డి


ఆర్జీ-2 ఏఐటీయూసీ ఆఫీస్‌లో జండా ఎగురవేస్తున్న ప్రకాష్

గోదావరిఖని, మే 1: మేడే స్ఫూర్తితో కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా పలు బొగ్గు గనులు, డిపార్ట్‌మెంట్లపై ఎర్ర జెండాలు రెపరెపలాడాయి. భాస్కర్‌రావు భవన్ నుంచి గోదావరిఖని చౌరస్తా వరకు సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల నారాయణ, కవ్వంపల్లి స్వామి, మడ్డి ఎల్లయ్య, ఆరెల్లి పోషం, మాదన మహేష్, కనకరాజు, రంగు శ్రీనివాస్, వెంకటరెడ్డి, గోషిక మోహన్ పాల్గొన్నారు. గోదావరిఖని టీబీజీకేఎస్ కార్యాలయంలో వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే ఉత్సవాలకు ఆ యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండావిష్కరించారు. ఈ కార్యక్రమంలో నూనె కొమురయ్య, మాదాసు రామమూర్తి, పర్లపల్లి రవి, చెల్పూరి సతీష్, జాహెద్‌పాషా, పోలాడి శ్రీనివాస్, బొగ్గుల సాయి, మహేందర్, లక్ష్మణ్, సురేందర్ పాల్గొన్నారు. టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఓసీపీ-5, జీడీకే1 ఇంక్లైన్, 2ఇంక్లైన్, 2ఏ గనులపై జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సంగెపు రాజు, మల్లయ్య పాల్గొన్నారు. తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రధానచౌరస్తాలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజే పాల్‌సింగ్, కొలిపాక రమేష్, మిట్టపల్లి కుమారస్వామి, ఓడెల శేఖర్, వెంకటేష్, జనగామ శంకర్ పాల్గొన్నారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పలు గనులపై జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఐ కృష్ణ, ఈదునూరి నరేష్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : ఆర్జీ-2 ఏరియాలో బుధవారం మేడే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కార్మిక సంఘాలు గనులు, వాటి కార్యాలయాల వద్ద అరుణ పతాకాలను ఆవిష్కరించి చికాగో అమరులకు నివాళులు అర్పించారు. ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ ప్రకాష్, సీఐటీయూ కార్యాలయంలో డివిజన్ కార్యదర్శి కుంట ప్రవీణ్, హెచ్ ఎంఎస్ ఆఫీస్‌లో ఆర్జీ-2 వైస్‌ప్రెసిడెంట్ దావు రమేష్, టీబీజీకేఎస్ ఆఫీస్ లో ఏరియా వైస్‌ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్, ఇఫ్టూ కార్యాయంలో బీ అశోక్‌లు ఎర్ర జెండాలను ఎగురవేశారు. ఓసీపీ-1 సైటాఫీస్‌లో ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో డిప్యూటీ సెక్రెటరీ వైవీరావు, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ నాయకుడు గడ్డం తిరుపతిలు జండాలు ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామగిరి : సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో బుధవారం మేడే ఉత్సవాలను కార్మిక సంఘాల నేతలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ కార్మిక సంఘాల నేతలు జీఎం కార్యాలయం గనులు, డిపార్టుమెంట్‌లపై ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో యూనియన్ నాయకులు వై.వీరావు, ఎంఆర్‌సీ రెడ్డి, జూపాక రాంచందర్, రవీందర్‌రెడ్డి, కొంరయ్య, ఆకుల వెంకన్న, ప్రసాద్, చిలువేరు స్వామి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.